క్లుప్తంగా

దివాన్ చెరువు పోస్టాఫీసు అప్‌గ్రేడ్


పోస్టాఫీసును ప్రారంభిస్తున్న దృశ్యం

రాజానగరం: దివాన్ చెరువు బ్రాంచ్ పోస్టాఫీసు అప్‌గ్రేడ్ అయ్యింది. సబ్ పోస్టాఫీసుగా మారింది. ఈ మేరకు కార్యాలయాన్ని శుక్రవారం తపాలా శాఖ రాజమహేంద్రవరం ప్రధాన కార్యాలయం సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోస్టాఫీసు నుంచి ఉత్తరాల బట్వాడా జరిగేదని, ఇక నుంచి దివాన్ చెరువు శాఖ నుండే నేరుగా ఉత్తరాల బట్వాడాతో పాటు నగదు లావాదేవీలూ జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సబ్ పోస్టుమాస్టర్ కె.బాబూరావు, స్థానికులు పాల్గొన్నారు.

లో ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి చర్యలు


సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

అనపర్తి: గ్రామాల్లో లో ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. అనపర్తి సబ్ డివిజన్ పరిధిలో గల విద్యుత్‌శాఖ అధికారులు, వివిధ విభాగాల క్షేత్రస్థాయి సిబ్బందితో శుక్రవారం స్థానిక సూర్య ఇన్ కల్యాణ మంటపంలో ఈఈ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదులపై సిబ్బంది సకాలంలో స్పందించి సమస్యలను పరిష్కరించాలని, ఈ విషయంలో నిర్లక్ష్య వైఖరి వహించరాదని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. డీఈఈ ఎం.నిరంజన్‌బాబు, ఏఈలు వీరభద్రరావు, బుజ్జిదొర, నాగేశ్వరరావు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీను పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తా

సీతానగరం: మండలంలోని జాలిమూడిలో గురువారం రాత్రి 10.30 గంటలకు ఓ గ్రావెల్ టిప్పర్ అదుపుతప్పి భవనంపై పడిపోయింది. పాతూరి శ్రీనివాస్‌కు చెందిన ఆ భవనం స్వల్పంగా ధ్వంసమైంది. రాజమహేంద్రవరం – సీతానగరం నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులలో భాగంగా గ్రావెల్ వేయడానికి ఈ టిప్పర్ వచ్చింది. కాగా.. శుక్రవారం మధ్యాహ్నం ఆ టిప్పర్‌ను తొలగించి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.

లైఫ్ స్కిల్స్‌పై అవగాహన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాధు జనరల్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు సాధు కోటేశ్వరరావు విద్యార్థులకు లైఫ్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. ప్రతిభ స్కూల్ ప్రిన్సిపాల్ ఆకన రవిచంద్ర పుస్తక పఠనం చేయించారు. చిత్ర లేఖనం నేర్పించారు. లైబ్రేరియన్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణ మహోత్సవం

ప్రకాశం నగర్: అమ్మఒడి సేవా తరంగిణి పుష్కర మహోత్సవం సందర్భంగా శుక్రవారం గౌతమ ఘాట్‌లోని రాధాగోపీనాథ మందిరంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవదాయ ధర్మదాయ శాఖ సలహాదారుడు జ్వాలాపురపు శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గుండె గుండెకు గోవిందుడు, గుడిసె గుడిసెకు గోవిందుడు అన్న సందేశంతో ఆధ్యాత్మిక, ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు ప్రారంభించి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాదిలో 108 ఉచిత శ్రీనివాస కల్యాణాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు విజయ్, కార్యదర్శి శివ, హిందూ చైతన్య వేదిక సభ్యులు పట్నాల సూరిబాబు పాల్గొన్నారు.

ఉచిత న్యాయసేవలపై అవగాహన


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా న్యాయసేవాధికారసంస్థ అందిస్తున్న ఉచిత న్యాయసేవలు, వివిధ నల్సా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లకు ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి సూచించారు. వారితో శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రత్యూష కుమారి మాట్లాడుతూ పారా లీగల్ వలంటీర్లు, ప్యానల్ లాయర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. ప్రమాదంలో ఉన్న పిల్లలు, మహిళలు, కార్మికులు, ట్రాన్స్‌జెండర్లు, వృద్ధులు, సామాన్యుల గురించి జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలపాలన్నారు.

అతిగా వాడితే అంతే సంగతులు

- పురుగుమందుల వినియోగంలో సంయమనం ముఖ్యం
- ఇష్టానుసారం పిచికారీ చేస్తే మిత్ర పురుగులకు ముప్పు


దోమాడలో రైతులకు మిత్ర పురుగులు, శత్రు పురుగులపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెదపూడి: వ్యవసాయంలో మిత్ర పురుగులు పంటకు మేలు చేసే రక్షకులు. పంటలను ఆశించే చీడపీడలను నివారించి పంటకు మేలు చేకూర్చే మిత్ర పురుగులు క్రమేపీ తగ్గిపోతున్నాయి. వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలని శత్రు పురుగులను నివారించే క్రమంలో మిత్ర పురుగులు అంతరించిపోతున్నాయి. ఈ నేపథ్యంలో మిత్ర పురుగులను కాపాడుకుంటూనే శత్రు పురుగులను నివారించాలి. వ్యవసాయశాఖాధికారులు రైతులకు మిత్ర పురుగులను కాపాడుకోవాలని, శత్రు పురుగులను నివారించాలని సూచిస్తున్నప్పటికీ రైతులు పురుగుమందుల వినియోగం పెంచడంతో మిత్ర పురుగులకు ముప్పు వాటిల్లుతోంది.

అనపర్తి నియోజకవర్గంలో 46,067 ఎకరాల్లో వరి సాగు

అనపర్తి మండలంలో 9,550 ఎకరాలు, పెదపూడిలో 18,000, రంగంపేటలో 2,776, బిక్కవోలులో 15,741 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. పురుగుమందుల పిచికారీ చేసే సమయం కావడంతో రైతులు ఎక్కువగా వరి సంరక్షణకు పురుగు ముందులు వినియోగిస్తున్నారు. పంట ఈనిక దశలో ఉంది. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. సాగులో అక్కడక్కడా పురుగులు కనిపించినా రైతులు కంగారుపడి ఎక్కువగా మందులు పిచికారీ చేయొద్దని, పంటకు దోహదపడే మిత్ర పురుగులను కాపాడుకోవాలని వ్యవసాయశాఖాధికారులు సూచిస్తున్నారు.

పంటకు మేలు చేకూర్చే మిత్ర పురుగులు ఇవి

సాలీడు, తూనీగ

పచ్చపురుగు, లద్దె పురుగులు పంటలపై పెట్టిన గుడ్ల నుంచి బయటకు వచ్చే సంతతి పురుగులను సాలీడు పురుగు ఎప్పటికప్పుడు తినేస్తూ వాటి సంతతి పెరగగకుండా నివారిస్తుంది. మరో పంట మిత్ర పురుగైన తూనీగలు చీడపురుగులు పంటలపై పెట్టిన గుడ్లను తినడమే కాకుండా, పరపరాగ సంపర్కం జరగడానికి చాలా దోహదపడతాయి. తూనీగ ఒక మొక్కపై నుంచి మరో మొక్కపై వాలినప్పుడు మగ పుష్పంలో ఉన్న పుప్పొడి రేణువులను ఆడ పుష్పంపై వదలడం వలన ఫలదీకరణం జరిగి పిండం, తర్వాత విత్తనం ఆ తర్వాత పంట మంచి దిగుబడికి దోహదపడుతుంది.

ట్రైకో గ్రామ

పంటను ఆశించే పచ్చపురుగు, లద్దె పురుగులు వాటి సంతతిని గుడ్ల ద్వారా పెంచుతాయి. ఈ పురుగులు పంట ఆకులపైన, పంట లేత భాగాలపైన గుడ్లను పెడతాయి. అలా గుడ్డు నుంచి బయటకు వచ్చిన వాటి సంతతి పూత, ఆకు పిందెలను తినేసి పంటకు నష్టం కలిగిస్తాయి. ట్రైకో గ్రామ అనే పంట మిత్ర పురుగు పంటపై పచ్చ పురుగు, లద్దె పురుగుపెట్టిన గుడ్లను ఎప్పటికప్పుడు తినేయడంతో శత్రు పురుగులైన వాటి సంతతి పెరగడకుండా పంటను కాపాడుతుంది.

కొన్ని మిత్ర పురుగులు

కందిరీగ, మిడత, పాడి సన్‌బగ్ వంటి మిత్ర పురుగులు సైతం పంటను ఆశించే చీడ పురుగులు పంటపై పెట్టిన గుడ్లను ఎప్పటికప్పుడు తినేస్తూ వాటి సంతతి పెరగకుండా నివారిస్తాయి. ఇలా ఒక్క రూపాయి ఖర్చులేకుండా పంటను ఆశించే చీడ పురుగులను నివారించడంలో సాయం చేస్తున్న మిత్ర పురుగులు, రైతుల నిర్లక్ష్యం కారణంగా నశించిపోతున్నాయి. ముఖ్యంగా పలు రకాల క్రిమి సంహారక మందులు అతిగా పిచికారీ చేయడంతో మిత్ర పురుగులు వేగంగా నశించిపోతున్నాయని వ్యవసాయశాఖాధికారులు అంటున్నారు.

అవసరం మేరకే క్రిమి సంహారక మందులు వినియోగించాలి



పంటలకు క్రిమి సంహారక మందులు అవసరం మేరకే వినియోగించాలి. కొంతమంది రైతులు మోతాదుకు మించి పిచికారీ చేస్తున్నారు. దీంతో మిత్ర పురుగులు క్రమంగా అంతరించిపోతున్నాయి. పంటపై ఒకటి రెండు చీడ పురుగులు కనబడినంత మాత్రన రైతులు వెంటనే స్పందించి వాటిని నివారణకు మందులు వాడాల్సిన అవసరం లేదు. పర్యావరణంతో లేదా మిత్ర పురుగులు ద్వారా అవి నశిస్తాయి. అవి మరీ ఎక్కువగా కనిపిస్తే అవసరం మేరకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాలి.

– టీవీఆర్ మణిదీప్, వ్యవసాయశాఖాధికారి, పెదపూడి మండలం

కాపవరంలో అమృత కలశ యాత్ర



కాపవరంలో మట్టి, ధాన్యం కలశాలతో యాత్ర నిర్వహిస్తున్న స్థానికులు

మధురపూడి: నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా కోరుకొండ మండలం కాపవరంలో శుక్రవారం అమృత కలశ యాత్ర జరిగింది. కాపవరం ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఈ యాత్ర నిర్వహించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా వివిధ గ్రామాల నుంచి సేకరించిన మట్టి, ధాన్యాన్ని కలశాలతో పట్టుకుని ర్యాలీ చేశారు. దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు అలరించారు. ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ మాట్లాడుతూ 22 గ్రామ పంచాయతీల నుంచి మట్టి, ధాన్యాన్ని సేకరించి కలశాల్లో భద్రపరిచామని, వీటిని దేశ రాజదాని ఢిల్లీకి పంపుతామన్నారు. అనంతరం ఎంపీపీ సూర్యకుమారితో పాటు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, సర్పంచుల సమాఖ్య మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- సంపరలో గడప గడపకూ మన ప్రభుత్వం


గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: రాష్ట్రంలో పేదరికం నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సంపర గ్రామంలోని రెండవ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అరకొరగా అమలు చేసిన పథకాలు సైతం జన్మభూమి కమిటీలు, టీడీపీనాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా మంజూరయ్యేవి కాదని, ఆ పార్టీ సానుభూతి పరులకు, లంచాలు ఇచ్చే వారికే పథకాలు అందేవని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సిఫారసులు, పైరవీలకు తావులేదని, అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు మంజూరవుతున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాలు కొనసాగించాలంటే మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా దీవించాలని ఆయన కోరారు. ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అద్దంకి భద్రం, నాగిరెడ్డి, వీరవెంకట సత్యనారాయణ, ఆర్.సత్యవతి, టి.సాయి, బీసీ సెల్ మండల కన్వీనర్ పప్పు సింహాచలం పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు


గోకవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: రైతుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, సచివాలయం భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అలాగే రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మి గిట్టుబాటు ధర పొందాలన్నారు. వ్యవసాయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, దాసరి సతీష్‌బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, నరాలశెట్టి నర్శయ్య, ఉనుకూరి ఏసురత్నం, తోలేటి రాంప్రసాద్, వార్డు సభ్యుడు తుమ్మల శివాజీ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పులపర్తి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో ప్రజారోగ్యం మెరుగు


వెదురుపాకలో రోగులకు మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు


గండ్రేడులో మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ తులసీ


నల్లమిల్లిలో రోగులకు మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజారోగ్యం మెరుగుపడుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని వెదురుపాకలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. శిబిరంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి డాక్టర్లకు పలు సూచనలు చేశారు. వైద్య సేవలు పొందిన వారికి మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. ప్రజలు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు మాతాశిశు సంరక్షణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, పార్టీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, నరాలశెట్టి నర్శయ్య, స్థానిక నాయకులు ఆకుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

బిక్కవోలు: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ బుంగా రామారావు అన్నారు. శుక్రవారం బలభద్రపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. బిక్కవోలు పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన ఈ క్రమంలో 705 మంది రోగులకు పరీక్షలు చేశారు. డాక్టర్ రాజీవ్, దుర్గాదేవి, వైద్య సిబ్బంది సేవలు అందించారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం

పెదపూడి: జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం అందించడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీపీ కేతా తులసి అన్నారు. శుక్రవారం గండ్రేడు గ్రామంలో సర్పంచ్ కుడిపూడి మాధవీలత అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 470 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి ఆరోగ్య సేవలు అందించాలని సిబ్బందిని కోరారు. ఎంపీడీవో పోకల విజయ భాస్కర్, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శివకుమార్, ఉప సర్పంచ్ కర్రి శ్రీనువాస్, వైఎస్సార్ సీపీ నాయకులు కుడిపూడి శ్రీను, సచివాలయ కార్యదర్శి శిరీషా, వీఆర్వో ఏడుకొండలు పాల్గొన్నారు.

రంగంపేట: ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రవేశపెట్టారని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. మండల పరిధిలోని నల్లమిల్లి గ్రామంలో సర్పంచ్ నల్లా పద్మ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ షమ్మీకుమార్, డాక్టర్ గంగాధర్, డాక్టర్ పార్థసారధి, డాక్టర్ చెల్లారావు, డాక్టర్ నవీన్ 549 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ మట్టా శ్రీను, ఉప సర్పంచ్ కంచుమర్తి సాయిబాబు, మాజీ సర్పంచ్ మేడిశెట్టి రవిశంకర్, పీహెచ్‌సీ డాక్టర్ జి.రామ్‌భాస్కర్ పాల్గొన్నారు.


రాపాకలో మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రాజు

రాపాకలో 735 మందికి..

సీతానగరం: రాపాకలో నిర్వహించిన శిబిరంలో 735 మందికి వైద్యసేవలు అందించారు. పీహెచ్‌సీ డాక్టర్లు రాజు, ఏసురాణి, స్పెషలిస్టులు జి.గౌస్‌బేగ్ (ఆర్థోపెడిక్), టి.విజయ్ భాస్కర్ (నేత్ర), పి.సాయిశంకర్ (దంత) వైద్యసేవలు అందించారు. 108 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 68 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. సర్పంచ్ గన్నిన బ్రహ్మాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు పిచ్చుకల రవి కుమార్, పిచ్చుకల విజయ్ కుమార్, రావూరి రామరాజు, పంచాయతీ కార్యదర్శి ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, ఎంపీహెచ్‌ఎస్ కె.సుధాకర్ పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం


పందలపాకలో తమ పిల్లలతో సరస్వతి పూజలు చేయిస్తున్న తల్లులు


గోకవరం వీరభద్రునిగద్దెలో సరస్వతీదేవి పూజ ఆచరిస్తున్న చిన్నారులు


సత్యసాయి పాదుకలకు పూజలు చేస్తున్న మహిళలు


చంద్రేడులో సరస్వతీదేవి అలంకరణలో కాత్యాయని


జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ తల్లి


అనపర్తి త్రిశక్తి పీఠంలో సరస్వతి దేవి అవతారంలో అమ్మవారు

రంగంపేట: శరన్నవరాత్ర మహోత్సవాలు ఆరవ రోజు శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. రంగంపేటలో దేవీ సెంటర్ వద్ద ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం అభిషేకాలు, అనంతరం కలశ స్థాపన, సహస్రనామ కుంకుమార్చనచేసి సరస్వతీదేవిగా అమ్మవారిని అలంకరించి ఆలయ అర్చకులు నాగేంద్ర శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పరమాన్నం నైవేద్యంగా సమర్పించారు. విద్యార్థులు సరస్వతీ దేవికి పూజలు నిర్వహించారు. భక్తులు, భవానీ మాల ధారులు అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకు ముందు అమ్మవారిని వెండి, బంగారు ఆభరణాలు, గజమాలలతో అలంకరించారు. విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. చంద్రేడు గ్రామంలో కొలువైయున్న కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో ఆరవరోజు అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. ఉదయం అభిషేకాల అనంతరం అమ్మవారిని వెండి, బంగారు నగలతో అలంకరించారు. కుంకుమ పూజలు నిర్వహించారు. వడపప్పు, చలివిడి, పానకం, పులిహోర నైవేద్యం సమర్పించారు. భక్తులు భారీగా తరలివచ్చి అభిషేకాలను తిలకించి అమ్మవారి దర్శించుకున్నారు. విద్యార్థులకు పెన్నులు బహూకరించారు.

సామూహిక కుంకుమ పూజలు...

మండలంలోని వెంకటాపురం, దొంతమూరు, పాత వీరంపాలెం గ్రామాల్లో విజయదుర్గాదేవి, కనక దుర్గాదేవిల ఆలయాల వద్ద సరస్వతీదేవి రూపంలో అలంకరించిన అమ్మవారికి మహిళలు, విద్యార్థులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

బిక్కవోలు: దేవీ నవరాత్రుల సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఆరవ రోజు సర్వసతీ దేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. విద్యార్థులు సరస్వతి పూజలు చేశారు. తోస్సిపూడి గ్రామంలోని కాలువ దగ్గర ఉన్న అమ్మవారు ఆలయం వద్ద వైఎస్సార్ సీపీ మహిళ నాయకురాలు గొలుగూరి భారతి ఆధ్వర్యంలో సరస్వతి పూజలు చేశారు. దాతల సహకారంతో విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు అందించారు. అనంతరం అన్నదానం చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు తేతల సుమ పాల్గొన్నారు. కొమరిపాలెం శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో, పందలపాక వెలమపేట రామాలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ తల్లి

పెదపూడి: మండలంలోని గొల్లలమామిడాడ గ్రామంలోని శ్రీ మణికంఠ స్వామివారి ఆలయంలో వేంచేసియున్న జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ తల్లి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. గురువారం మూల నక్షత్రం సందర్భంగా అమ్మవారు సర్వసతి దర్శనంతో అలరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి లయన్ మండ రాజారెడ్డి మాట్లాడుతూ పవిత్ర శరన్నరాత్రుల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసి పూజా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు పూజలో అమ్మవారికి అర్పించిన పుస్తకాన్ని, పెన్నును బహూకరించినట్లు తెలిపారు. లయన్ వీరబాబు, డీవీకే రెడ్డి బాలీజీ, యువరాజు, రామప్ప, రమేష్‌రెడ్డి త్రిమూర్తులు పాల్గొన్నారు.

సరస్వతీదేవిగా దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: మండల వ్యాప్తంగా దేవీశరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం గోకవరంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలోని కనకదుర్గమ్మ సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. వీరభద్రునిగద్దెలోని కనకదుర్గమ్మ సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూలనక్షత్రాన్ని పురస్కరించుకుని చిన్నారులు సామూహిక సరస్వతీదేవి పూజలు నిర్వహించారు.

నేడు లలితాత్రిపురసుందరీదేవి అలంకారం

శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు శనివారం గోకవరంలోని దేవీచౌక్ కనకదుర్గమ్మ లలితాత్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిస్తారు.

వీణాపాణికి ప్రత్యేక పూజలు

అనపర్తి: మండలంలోని పొలమూరు, రామవరం, కుతుకులూరు, పెడపర్తి, పులుగుర్త, కొప్పవరం, మహేంద్రవాడ గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు, అమ్మవారిని కొలువు తీర్చిన మంటపాలకు పెద్ద సంఖ్యలో విచ్చేసిన తల్లితండ్రులు తమ పిల్లలతో సరస్వతీ పూజలు జరిపించి జ్ఞానప్రదాయినీ....వాగ్దేవీ ఆశీర్వదించమ్మా అంటూ వేడుకున్నారు. స్థానిక పాతవూరు నల్లకాలువ గట్టు వద్ద గల సరస్వతీ ఆలయంలో చిన్నారులచే సరస్వతీ పూజలు జరిపించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక వీరుళ్లమ్మ ఆలయం ప్రాంగణంలో ఓంశక్తి సత్సంగం సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన త్రిశక్తి పీఠంలో, శాంతిపురంలోని శ్రీ గణపతి శ్రీ సరస్వతి సహిత శ్రీ మహాలక్ష్మి దేవి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులు వీణాపాణికి సామూహికంగా పూజలు జరిపారు. త్రిశక్తి పీఠంలో సరస్వతీ దేవి పూజలు నిర్వహించిన విద్యార్థులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి భార్య ఆదిలక్ష్మి చేతుల మీదుగా అమ్మవారి ఫొటో, పుస్తకాలు, పెన్నులు అందజేశారు.

సరస్వతీమాతకు పూజలు


చక్రద్వారబంధంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

రాజానగరం: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం మూల నక్షత్రం సందర్భంగా జగన్మాతను సరస్వతిగా అలంకరించి పూజలు చేశారు. చక్రద్వారబంధంలోని దేవీచౌక్ వద్ద సుమారు 200 విద్యార్థులు సరస్వతీదేవికి పూజలు చేశారు. అనంతరం దొవులూరి పూసలరావు సహకారంతో వారందరికీ నోట్ బుక్స్, పెన్నులు పంచారు. నల్లమిల్లి సూర్యారావు భోజన సదుపాయం కల్పించారు. అలాగే రాజానగరంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో కొలువైవున్న సరస్వతీ మాతను సీఐ కాశీవిశ్వనాథ్ దర్శించుకున్నారు.

సీతానగరం: దేవి నవరాత్ర ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అమ్మవారు సరస్వతిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. రాపాక పంచాయతీ పరిధిలోని శ్రీరామ నగరం కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పువ్వాడ కృష్ణ ఆధ్వర్యంలో పిల్లలకు నోటు బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. రఘుదేవపురం కోటదుర్గ, రాజంపేట కనకదుర్గ, మునికూడలి ఆలయాల్లో కుంకుమ పూజలు జరిగాయి. వంగలపూడి గాయత్రీదేవి ఆశ్రమంలో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

బాబా పాదుకలకు సామూహిక పూజలు

రంగంపేట: సత్యసాయి సమాజ సేవా సూక్తులు ఆచరించి మానవ జీవితాన్ని చరితార్థం చేసుకోవాలని కోటపాడు శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్‌నాథ్ కోరారు. శుక్రవారం కోటపాడు సత్యసాయి సేవా సదనంలో సత్యసాయి అవతార ప్రకటన ఉత్సవాల సందర్భంగా భక్తులతో బాబా పాదుకలకు సామూహిక పూజలు చేయించి మాట్లాడారు. రంగంపేట, ఈలకొలను గ్రామాల్లోని సత్యసాయి మందిరాల్లో బాబా పాదుకలకు సహస్రనామార్చన చేశారు. అనంతరం 98 భజన పాటల కార్యక్రమం నిర్వహించారు. సేవా సమితి కన్వీనర్ తిక్కిశెట్టి సుబ్బారావు, సేవాదళ్ లీడర్ చిరట్ల రంగమాంబ పాల్గొన్నారు.